# అశ్వమేధయాగం

"కమాన్ రాణీ కమాన్" అని నిద్రలో పలవరిస్తున్నాడు కుటుంబరావు

ఉలిక్కిపడి లేచిన అతని భార్య సీతామహాలక్ష్మి "ఎవరా రాణీ? ఏమా కథ?" అని ఆలోచిస్తూ వుండగా,

కుటుంబరావు "రోజీ నువ్వెందుకొస్తావే మధ్యలో? రావద్దు. కమాన్ రాణీ నువ్వే రావాలి. రా! రా! కమాన్" నిద్రలోనే గట్టిగా అరవసాగాడు.

రోజీని వద్దనడం, రాణీని రమ్మనడం వినేసరికి సీతామహాలక్ష్మి రెండు కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగి కళ్ళు నిండిపోయి, రెప్పల అంచులమీంచి జలజలా రాలి, చెంపలమీంచి జారి పెదాలమీదికి మళ్ళడం




వల్ల నోటికి ఉప్పగా తగిలి కళ్ళు తుడుచుకుంది

సముద్రపు నీరులా వుప్పగా వుండే కన్నీరు ఎంత కార్చినా ప్రయోజనం లేదనుకుని నిశ్చయించుకుని భర్తను లేపి "ఏమండీ ఎవరా రాణీ? ఎవరా రోజీ"అని అడిగింది.

కుటుంబరావు ఆమె ముఖాన్ని ఆప్యాయంగా చేతుల్లోకి తీసుకుని "కన్నీళ్ళల్లో కరిగిన కాటుకతో మరకలైన నీ ముఖం మబ్బుల్లో చందమామలా వుంది సీతా!" అన్నాడు.

"మాట మార్చకండి. ఎవరా రాణీ?" అని సూటిగా అడిగింది.

"రాణీ నా ఆశాజ్యోతి! నా భాగ్యదేవత! నా మనోరథాన్ని బంగరు కలల్లోకి లాక్కుపోగల ఏకైక జీవి!"....ఇంక వినలేకపోయింది సీతా మహాలక్ష్మి. ఎంత ప్రయత్నించినా కన్నీళ్ళు కట్టలు తెంచుకుని ప్రవహించడం, ఆమె భోరున ఏడవడం చూసిన కుటుంబరావు వేదాంతిలా నవ్వుకున్నాడు.

"నా కంటె మీకా రాణీ ఎక్కువైతే అక్కడే వుండక యీరా! ఇక్కడ పడుకుని నా రాణీ నా రాణీ అని కలవరించడం ఎందుకు?" అని మధ్యలో వీలు చూసుకుని విచారించసాగింది సీతా మహాలక్ష్మి.

"తప్పకుండా వెళ్తాను, నా రాణీ దగ్గరకి రేపే వెళ్తాను" అని కుటుంబరావు సిగరెట్ వెల్గించాడు

"అంతవరకూవచ్చిందన్నమాట! మీరు రోజూ ఇంటికి ఆలస్యంగా వస్తుంటేనే నాకు అనుమానం వచ్చింది, చూస్తాను. నన్నూ, ముగ్గురు పిల్లల్నీ అన్యాయం చేసి మీరు ఎలా వెళ్తారో నేనూ చూస్తాను" అని కుటుంబరావు కాలర్ పట్టుకుని గట్టిగా గుంజి మళ్ళీ భోరున ఏడవసాగింది.

"కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ ఏల ఏడ్చెదో హాటక గర్భు రాణీ!" అన్నాడు కుటుంబరావు ప్రేమగా ఆమె కన్నీళ్ళు తుడవబోతూ.

"నేను రాణీని కాదు" అని అతని చేతిని విసిరికొట్టింది.

"జిస్సు ముఖమా! రేపు పందెంలో




గెలవబోయే గుర్రం పేరు రాణీ! నా ఆశలన్నీ దానిమీదే వున్నాయి ఈదెబ్బతో మన దరిద్రంపోయి, రేపట్నుంచీ లక్ష్మిదేవి మనింట్లో నాట్యం చేస్తుంద" అన్నాడు కుటుంబరావు వుత్సాహంగా మళ్ళీ వేదాంతిలా నవ్వి.

సీతామహాలక్ష్మి మళ్ళీ ఏడ్చింది.

"నువ్వు అలా ఏడుస్తూండబట్టే లక్ష్మిదేవి రావడంలేదు. కనీసం రేపటిదాకా ఆ ఏడుపు ఆపు. కొంచెం నవ్వు నటించు" అన్నాడు చికాగ్గా!

"మనలాంటి మధ్య తరగతి కుటుంబాలు సునాయాసంగా లక్షలు సంపాదించుకోవాలని ఈ గుర్రప్పందేల మోజులో పడి, వున్నది కాస్తా పోగొట్టుకుంటూంటే ఏడవక ఏం చెయ్యమంటారు?" అంది కాస్సేపు ఏడుపు ఆపి.

"ప్లీజ్! సీతా ఈ ఒక్కసారి క్షమించు. ఈ ఒక్క రోజు ఏడవకు, ఈ సారి తప్పకుండా రాణీ గెలుస్తుంది. లక్షలు! లక్షలు! లక్షలు! ఇంట్లో అంత డబ్బు పెట్టుకోడానికి చోటువుండదు కాబట్టి కొంచెం బ్యాంక్‌లో వెయ్యక తప్పదు. నీకు వంకీలు, దండకడియాలు నాగరం, జూకాలూ, వడ్డాణం! ఒకటేమిటి ఏడు వారాల నగలూ చేయిస్తాను, పాపాయిని, బాబుని ఆ వెధవ వీధిబడిలోంచి కాన్వెంటులోకి మార్చేద్దాం. రోజూ కారో నే దింపాలి నువ్వూ పిల్లలు వెళ్ళడానికో కారు! నాకో కారు! పోనీ నా మాటలు వినైనా నవ్వుతున్నావు. రేపటిదాకా అలా నవ్వుతూ వుండు చాలు! లక్ష్మిదేవి వెదుక్కుంటూ మనింటకే వచ్చేస్తుంది" అని ఆమె ముఖానికి పులుముకున్న కాటుక ప్రేమగా తుడవసాగారు కుటుంబరావు.

"నేను కూడా ఇలాగే కలలుకని అన్ని రాష్ట్రప్రభుత్వాల లాటరీ టిక్కట్లూ కొనేదాన్ని. నాలాగే చాలామంది కొనేవారు. ఇంకా కొంటూనే వున్నారు ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మినా నమ్మకపోయినా వాళ్ళు నడిపే లాటరీలను నమ్ముతున్నారు ఏదో లాటరీ తగిలితే తప్ప ఈ ప్రజల్ని మనం బాగుచెయ్యలేమని ప్రభుత్వం ఒప్పుకుని స్వయంగా లాటరీలు నడిపిస్తోందే! అందుకే ఈ గుర్రప్పందేల్ని ఇంకా నిషేధించలేదు. వెధవ గుర్రాలన్నిటినీ జట్కాలకి కట్టి నడిపిస్తే రవాణా సౌకర్యాలు పెరుగుతాయి వంద ఎకరాల ఆ రేస్ గ్రౌండ్స్‌లో లేనివాళ్ళకి ఇళ్ళు కట్టించి ఇస్తే ఈ పందేలకి కట్టే డబ్బుని ప్రభుత్వానికే చెల్లిస్తే కొన్నాళ్ళకి అందరూ ఇళ్ళవాళ్ళవుతారు." అని వుద్రేకంగా చెప్తూన్న భార్య మాటలకి అడ్డొచ్చి "ఈ వుపన్యాసాన్ని రేపటిదాకా వాయిదా వెయ్యి. ఈ ఒక్కసారి కాదనకు" అని బతిమాల సాగాడు కుటుంబరావు.

"మిమ్మల్ని అని ఏం లాభం? గుర్రాన్ని, జాకీని, మార్చి అదృష్టాన్ని లెక్కలు కట్టుకునే మీలాంటివాళ్ళు నాయకుల్ని, పార్టీలని లెక్కలుకట్టి భవిష్యత్‌ని జూదం ఆడుతున్నారు. నాయకులు ప్రజల్ని పెట్టుబడిగాపెట్టి రాజకీయాలతో జూదం ఆడుతున్నారు. అందుకే ప్రభుత్వం ఈ జూదాన్ని ఆపలేకపోతోంది. ఈ జూదం ఆగిపోతే ఎలా? కానీ గెలుస్తానని అనుకోడం కేవలం భ్రమ! ఆడించేవాళ్ళు వున్నప్పుడు జూదం ఆడ్డానికి సిగ్గెందుకు? వెళ్ళండి!" అని సీతామహాలక్ష్మి మరి మాట్లాడలేకపోయింది. కుటుంబరావు ఓడిపోయాడు రాణీ ఓడిపోయింది.

[నీతి :-జీవితమే ఒక జూదము! కాబట్టి గుర్రపు పందెములు నిషేధించనక్కర్లేదు.]

—తంబు